క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కోస్గి: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు తమ ఆరోగ్య పరిరక్షణ విషయంలో ముఖ్యంగా సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని గుండుమాల్ పీహెచ్‌సీ వైద్యాధికారి కిష్టమ్మ, జిల్లా మలేరియా అధికారి రాఘవేంద్ర రెడ్డి సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని చంద్రవంచ హెల్త్‌సబ్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని వీధులో పర్యటించి నిల్వనీరు ఉన్న చోట, ఇతర అపరిశుభ్ర వాతావరణం ఉన్న ప్రాంతాల్లో అప్పటికప్పుడు మందులు పిచికారి చేయించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి అశోక్‌కుమార్, సూపర్ వైజర్లు రాంచందర్‌జీ, శంకర్, రవి కుమార్ ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చేగువేరా జయంతి



మద్దూరు: ప్రపంచ విప్లవ యోధుడు చేగువేరా జయంతిని మండల కేంద్రంలో శుక్రవారం అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన పోరాటాలు గుర్తుకు చేసుకున్నారు. చేగువేరా ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కృష్ణ, సభ్యులు వెంకట్, చిన్నయ్య, సామెల్, దాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

మాగనూర్: మండలంలోని చిన్నపొర్లలో భూతగాదాలతో ఒక నిండు ప్రాణం తీసిన దుండగులను కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు అడ్వకేట్ రాజు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పోలీస్ వ్యవస్థ నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలైందని ఆరోపించారు. డయల్-100కి బాధితులు ఫోన్‌చేసిన సరైన సమయంలో స్పందించకపోవడంతో దారుణం చోటుచేసుకుందన్నారు. సంబంధిత పోలీసు ఉన్నతాధికారులు ఉట్కూర్ మండల పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.

మత్స్యశాఖ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలి



ధన్వాడ: మత్స్యశాఖ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని నియమించాలని జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం ఉపాధ్యక్షుడు నీరటి నర్సింహానాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మత్స్యకార సంఘంలో పెద్దఎత్తున మదిరాజ్‌లు ఉన్నారని, బెస్త సామాజిక వర్గానికి చెందిన మెట్టుకాడి సాయికుమార్‌ను నియమించడం ముదిరాజ్ సామాజిక వర్గాన్ని మోసం చేయడమే అన్నారు. తక్షణమే సాయికుమార్ నియామకం రద్దుచేసి ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ బాలస్వామి, మాజీ డైరెక్టర్‌లు చంద్రయ్య, బాలయ్య, లక్ష్మయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో కూలిన పీఓపీ



అమరచింత: మున్సిపల్ కార్యాలయంలో పైకప్పుకు ఏర్పాటు చేసిన పీఓపీ కుప్పకూలింది. మున్సిపల్ కార్యాలయాన్ని నిరుపయోగంగా ఉన్న పీఏసీఎస్ గోదాంలోకి మార్చేందుకు వాటికి మరమ్మతు చేపట్టేందుకు సుమారు రూ.36 లక్షలతో పనులు చేపట్టారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ కార్యాలయం పైభాగంలో పీఓపీని ఏర్పాటు చేశాడు. పీఓపీ చేసి నాలుగేళ్లు కూడా కాకముందే వారం రోజుల కిందట వీచిన ఈదురు గాలికి కూలింది. నాణ్యత లేకుండా పీఓపీ పనులు చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మూడో, తొమ్మిదో వార్డు కౌన్సిలర్లు విజయరాములు, రాజశేఖర్‌రెడ్డి,ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వద్దు

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

దామరగిద్ద: గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదని ఫిర్యాదులు రాకుండా సమస్యలను పరిష్కరిస్తూ ప్రజా సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నర్సప్ప అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో సర్పంచ్‌ల ఎన్నికలు జరిగే వరకు గ్రామాల పరిపాలన బాధ్యతలు ప్రత్యేక అధికారులు పంచాయతీ కార్యదర్శుల పైనే ఉందన్నారు. ఎంపీటీసీల పదవీ కాలం దగ్గర పడుతుండటంతో మరింత బాధ్యత పెరగనుందన్నారు. గ్రామస్థాయిలో ప్రజా సమస్యలపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం ప్రారంభ మైనందును పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. అంతకుముందు వివిధ శాఖల అధికారులు తమ అభివృద్ధి నివేదికలను చదివి వినిపించారు. ఉల్లిగుండం గ్రామంలో కొత్త కాలనీకి విద్యుత్ సదుపాయం కల్పించడం లేదని ఎంపీటీసీ ఏఈ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఏఈ స్పందించి విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. బాపన్‌పల్లి తదితర గ్రామాల్లో తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ఆర్‌అండ్‌బీ రోడ్ల మంజూరు నిర్మాణ ప్రగతిపై ఏఈని ఆరాతీయగా ఉల్లిగుండం, విఠలపూర్ తదితర గ్రామాల పంచాయతీరాజ్ రోడ్లు త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య, విద్యా వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జయరాములు, ఎంపీపీ నర్సప్ప, విండో అధ్యక్షుడు ఈదప్ప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్‌అండ్‌బీ ఈఈ

నారాయణపేట: నారాయణపేట రహదారులు భవనాల శాఖ ఈఈగా బదిలీపై వచ్చిన శ్రవణ్ ప్రకాష్ శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములై పనిచేయాలని, పలు అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు పంపాలని నూతన ఈఈకి ఎమ్మెల్యే సూచించారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి



కోస్గిలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ రామకృష్ణ

మద్దూరు: రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని ఫర్టిలైజర్స్, ఎరువుల డీలర్లకు జిల్లా వ్యవసాయాధికారి జాన్‌సుధాకర్ తెలియజేశారు. శుక్రవారం మండలంలోని రైతు వేదికలో ఫర్టిలైజర్స్, ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. విత్తనాలు విక్రయించే డీలర్లు తప్పనిసరిగా విక్రయించిన విత్తనాల వివరాలు, రైతులవారిగా రిజిష్టర్‌లో పొందుపరుచాలన్నారు. మీ దగ్గర ఉన్న స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్‌చేసి బోర్డుపై ప్రదర్శించాలని, రైతులకు పురుగుల మందు వాడకం తగ్గించే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. అధిక ధరలకు పురుగుల మందులు, విత్తనాలు ఎట్టి పరిస్థితుల్లో అమ్మొద్దని, ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఓ రామకృష్ణ, మండల ఫర్టిలైజర్స్, సీడ్ డీలర్లు పాల్గొన్నారు.

కోస్గి: రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఓ రామకృష్ణ, ఏఈఓ నవ్య సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని బిజ్జారంలో రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. మార్కెట్‌లో కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలు అమ్ముతూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. రైతులు విధిగా వ్యవసాయశాఖ అనుమతులు ఉన్న దుకాణంలోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలుకు సంబంధించి రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



సింగారం యూపీఎస్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం ప్రాథమిక పాఠశాల లో చిన్నారులకు శుక్రవారం అక్షరభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటిసారి పాఠశాలకు వచ్చి 1వ తరగతిలో కూర్చున్న చిన్నారులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో ఓనమాలు దిద్దించారు. అనంతరం టీచర్లు మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ బడిలో చదువుకోవడం అభినందనీయమని అన్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నడుస్తున్నాయని చెప్పారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్ అందిస్తామని, నిష్ణాతులైన టీచర్లతో బోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయప్రకాష్, నర్సింహులు, వెంకటయ్య, స్వామి, ఏఏపీ కమిటీ చైర్మన్ స్వరూపా రాణి, అంగన్‌వాడీ టీచర్ పద్మ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని వివిధ పాఠశాలలో శుక్రవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. మండలంలోని సీపీఎస్ పాఠశాల, మల్లెపల్లిలోని యూపీఎస్ పాఠశాలలో సరస్వతీదేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సునంద, నర్సింగప్ప, ఉపాధ్యాయులు కృష్ణ, బ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.



ఊట్కూరులో..

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ శ్రీదేవి

నారాయణపేట రూరల్: ప్రజలు సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ శ్రీదేవి అన్నారు. శుక్రవారం పేరపళ్ల రైతువేదికలో బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, గృహహింసా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు.. ఆమె మాట్లాడుతూ మత్తుపదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అదేవిధంగా సైబర్ నేరాల వలలో పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. మైనర్లు వాహనాలను నడిపించొద్దని విపత్తు నివారణ చట్టం అమలులో ఉన్నందున నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. అదేవిధంగా మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీమ్స్ ఉంటాయనే విషయంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్ లైన్ నెంబర్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ బాలరాజు, సమీనా, సఖీసెంటర్ సభ్యులు, స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేశ సేవలో యువత ముందుండాలి



నారాయణపేట రూరల్: దేశ సేవలో యువత ముందుండాలని టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అన్నారు. వారియర్స్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొంది రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించి అగ్నివీర్‌లో స్థానం సంపాదించిన జిల్లా యువతకు శుక్రవారం స్థానిక లయన్స్‌క్లబ్ ఆవరణలో శాలువాతో సన్మానించారు. అంతకుముందు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. దంతాలు, కంటి, గుండె, శరీర ఇతర అవయవాలను పరీక్షించారు. డాక్టర్ గందె కార్తిక్, నాగేష్, వినయ్ 60మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కో-షాధికారి రవికుమార్‌గౌడ్, అకాడమీ డైరెక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



కోస్గిలో మొక్కలకు నీరుపోస్తున్న కమీషనర్, తదితరులు



నిడ్జింతలో గుంతలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయరాములు

కోస్గి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విరివిగా మొక్కలునాటి పర్యవరణాన్ని కాపాడాలని మున్సిపల్ కమీషనర్ శశిధర్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం బడిబాటలో భాగంగా పట్టణంలోని పలు పాఠశాలల్లో కౌన్సిలర్లు, పాఠశాల హెచ్‌ఎంలు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ అన్ని శాఖలు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి హరితహారంలో పాల్గొని మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బెజ్జు సంగీత, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దూరు: ప్రతి ఒక్కరూ కనీసం ఆరు మొక్కలు నాటాలని ఎంపీడీఓ జయరాములు సూచించారు. హరితహారం పనులను శుక్రవారం ఉపాధి ఏపీఓ సిద్దేశ్వర్‌తో కలిసి మండలంలోని ఎక్కమేడ్, నిడ్జింత గ్రామాల్లో పరిశీలించారు. ఎక్కమేడ్ నుంచి మద్దూరు వరకు రోడ్డు ఇరువైపుల మొక్కలు నాటడానికి పనులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఉపాధి కూలీలకు రోడ్డు ఇరువైపుల ఎంత మేరకు గుంత తీయాలో వివరించారు. రోడ్డు ఇరువైపుల నాటడానికి పెద్ద మొక్కలను కోస్గి మండలంలోని భక్తిమళ్ల పారెస్ట్ నర్సరీ నుంచి తీసుకొస్తామని తెలిపారు. అలాగే నిడ్జింతలోని పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

ఆత్మకూర్: వినియోగదారులు, రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి కొత్త రుణాలు పొందాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్‌బ్యాంక్ మేనేజర్ నవీన్‌కుమార్, ఫీల్డ్‌ఆఫీసర్ మహమ్మద్‌అలీ అన్నారు. శుక్రవారం మండలంలోని పిన్నంచర్లలో వినియోగదారులకు అవగాహన కల్పించారు. పిల్లల భవిష్యత్‌కు ఉపయోగపడే డిపాజిట్ పాలసీలు, జీవితబీమా, పంట రుణాలు, పొదుపు, బ్యాంక్‌లావాదేవీలు తదితర విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది అభినవ్, ప్రసాద్, కుమార్, గ్రామపెద్దలు నారాయణరెడ్డి, ఖాజన్న, రాబర్టు, దర్శన్‌గౌడ్, సత్యన్న, స్థానికులు ఉన్నారు.

జీహెచ్‌ఎంలకు సన్మానం

కోస్గి: మండల పరిధిలోని ఉన్నత పాఠశాలలకు నూతన జీహెచ్‌ఎంలుగా శుక్రవారం పలువురు బాధ్యతలు తీసుకోగా తపస్ మండల శాఖ ఆధ్వర్యంలో నూతన జీహెచ్‌ఎంలను సన్మానించారు. బదిలీలు, పదోన్నతుల సందర్భంగా పలువురు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి మండలానికి వచ్చారు. శుక్రవారం ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరిన జీహెచ్‌ఎంలకు సంబంధించి సర్జఖాన్‌పేట జెడ్పీహెచ్‌ఎస్‌కు కృష్ణగౌడ్, జెడ్పీహెచ్‌ఎస్ బహార్‌పేట్ వెంకటేశ్వరి, కోస్గి ఉర్దూ మీడియం పాఠశాలకు బషీర్ అహ్మద్, ముశ్రీఫా జెడ్పీహెచ్‌ఎస్‌కు శేఖరయ్య, బోగారం పాఠశాలకు వెంకట్‌రెడ్డి, గుండుమాల్ పాఠశాలకు శేఖర్ రెడ్డి, మీర్జాపూర్ పాఠశాలకు వెంకట్రామ్ రెడ్డి జీహెచ్‌ఎంలుగా బాధ్యతలు తీసుకున్నారు. సన్మానించిన వారిలో తపస్ నాయకులు అంజిలయ్య, వెంకటేష్, పరందాములు, నాగరాజు, వెంకట్రాములు, సురేందర్, రమేష్, నర్సింహ పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలుర)కు నూతన హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన నాగరత్నంకు శుక్రవారం మండలంలోని యువక మండలి సభ్యులు శాలువాతో సన్మానించారు. పాఠశాలను జిల్లాలోనే ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దాలని కోరారు.



సర్జఖాన్‌పేటలో..



సన్మానిస్తున్న యువక మండలి సభ్యులు

చెరువుకాదు.. క్రీడా మైదానం



నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మైదానంలో సగానికిపై భాగం వాననీటితో నిండి చెరువును తలపిస్తుంది. కొన్ని ఏళ్లుగా పట్టణ క్రీడాకారులకు ఇది తప్ప ఆడుకునేందుకు అనువైన స్థలం లేదు. అదేవిధంగా చాలా మంది తమ చిన్నారులకు సైకిల్, బైక్ నేర్పించడానికి సైతం ఉపయోగిస్తుంటారు. అయితే ఎప్పుడు వాన పడినా మైదానం ఇలా నీటితో కుంటలా మారి నిరుపయోగంగా తయారవుతుంది. పాలకులు, అధికారులు చొరవ తీసుకుని నీరు నిల్వకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని క్రీడాకారులు కోరుతున్నారు.

నులిపురుగులను నివారిద్దాం..



మాట్లాడుతున్న డాక్టర్ నర్సింహరావు సగరి

నారాయణపేట రూరల్: నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోటకొండ వైద్యులు డాక్టర్ నర్సింహరావు సగరి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మండల స్థాయి అంగన్‌వాడీ, ఆశవర్కర్ల అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్నారులకు నులిపురుగులతో జ్వరం, రక్తహీనత, మానసిక, శారీరక తదితర జబ్బులు వస్తాయని, పౌష్టికాహారం తీసుకోవడంతో చాలా వరకు తగ్గించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 20న నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేద్దామన్నారు. ప్రతి రెండు సంవత్సరాలోపు చిన్నారులకు అరమాత్ర, 19 సంవత్సరాల వరకు ఆల్‌బెండాజోల్ మాత్ర వేయాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శోభారాణి, యాదమ్మ, ప్రభాకర్, నరేష్, పుష్ప, సరస్వతి, రామేశ్వరీ, పుష్పలత పాల్గొన్నారు.

మాగనూర్: ఈ నెల 20న నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని మండల వైద్యాధికారిణి నాగజ్యోతి అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలకు జాతీయ నులిపురుగు నివారణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి రెండు సంవత్సరాలోపు చిన్నారులకు మాత్రమే వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాగనూర్‌లో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నాగజ్యోతి

జోగినీలకు నిత్యావసర సరుకుల పంపిణీ

నారాయణపేట: ఓఎంఐఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో జోగినీలకు నిత్యావసర సరుకులను ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాస్‌రావు చేతుల మీదుగా అందజేశారు. శుక్రవారం స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఓఎంఐఎఫ్ సంస్థ వారు ఏర్పాటుచేసిన సరుకుల పంపిణీలో వారు పాల్గొని మాట్లాడారు. జిల్లాలో జోగినీల సంక్షేమంకోసం ఓఎంఐఎఫ్ పని చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామాల్లో జోగిని కమిటీ సభ్యులు కాకుండా చూడటం ,బాల్యవివాహాలు, మూఢనమ్మకాల నిర్మూలనకు అందరు కృషి చేయాలన్నారు. అదేవిధంగా ఓఎంఐఎఫ్ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ ఏంజెలా డేవిస్ మాట్లాడుతూ.. ఓఎంఐఎఫ్ సంస్థ 350గ్రామాల్లో జోగినీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. అనంతరం సేవ కార్యక్రమంలో భాగంగా 150మంది జోగినీలకు నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఓఎంఐఎఫ్ స్టాఫ్ హజమ్మ, ఆశమ్మ, నారాయణ, నర్సింహులు, రజిని తదితరులు పాల్గొన్నారు.



సరుకులను పంపిణీ చేస్తున్న ఓఎంఐఎఫ్ సంస్థ నిర్వాహకులు